

ఇ - పంట నమోదు చేసుకోవాలి

జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు

పాలకోడేరు : రాష్ట్ర ప్రభుత్వం ఇ-పంట నమోదును జిపిఎస్ ఆధారంగా నమోదు చేసేందుకు అనుమతిచ్చిందని, జిల్లాలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో ఈ ప్రక్రియ ప్రారంభమైందని రైతులు పంటల వివరాలను ఇ-పంటలో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు అన్నారు. పాలకోడేరులో జరుగుతున్న ఇ-పంట నమోదు ప్రక్రియను శనివారం ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడి పలు సూచనలు, సలహాలు అందజేశారు. సాగు చేసే ప్రతి రైతూ తమ పంటల వివరాలను ఇ-పంటలో నమోదు చేసుకోవాలన్నారు. ఇలా చేసుకోవడం ద్వారా ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. వ్యవసాయంలో ప్రభుత్వం అందించే ప్రతి లబ్ధి రైతులకు చేకూరే విధంగా ఇ-పంట నమోదు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి వి.నారాయణరావు, భీమవరం సహాయ వ్యవసాయ సంచాలకులు సిహెచ్.శ్రీనివాస్, విఎఎలు జి.శ్రీదేవి, సత్యనారాయణ ఉన్నారు.

కొబ్బరి కొనేదెవరు..!

జిల్లాలో కొబ్బరి సాగు చేసే రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పండించిన పంటను కొనేవారు లేక, గిట్టుబాటు ధర దక్కక దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. కొబ్బరిపై కేంద్ర ప్రభుత్వ విధానాలు రైతులను కోలుకోలేకుండా చేస్తున్నాయి. రెండు జిల్లాల్లో వేలాది ఎకరాల్లో కొబ్బరి సాగవుతున్నా ఆ రైతుల గురించి ప్రజాప్రతినిధులుగాని, అధికారులుగాని పట్టించుకున్న దాఖలాల్లేవు. దీంతో తమకు న్యాయం చేయాలంటూ కొబ్బరి రైతులు రోడ్డెక్కేందుకు సిద్ధమయ్యారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించకపోతే కొబ్బరి రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోనున్నారు.



తీవ్ర ఇబ్బందుల్లో కొబ్బరి రైతులు

రెండు జిల్లాల్లో 50 వేల ఎకరాల్లో కొబ్బరి సాగు

కొనుగోలు కేంద్రాలు లేక దక్కని గిట్టుబాటు ధర

పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొబ్బరి సాగులో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. విభజిత ఏలూరు జిల్లాలో 35 వేల ఎకరాల్లో, పశ్చిమగోదావరి జిల్లాలో 15 వేల ఎకరాల్లో మొత్తంగా రెండు జిల్లాల్లో 50 వేల ఎకరాల్లో రైతులు కొబ్బరి సాగు చేస్తున్నారు. రైతులు ప్రతియేటా పెద్దఎత్తున కొబ్బరి పండిస్తున్నప్పటికీ అధికారులుగాని, ప్రజాప్రతినిధులుగాని కొబ్బరి రైతుల గురించి పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం రైతుకు కొబ్బరికాయకు దక్కే ధర రూ.ఏడు మాత్రమే. మార్కెట్లో మాత్రం రూ.15కు పైగా అమ్ముతున్నారు. రైతులకు గిట్టుబాటు ధర దక్కకపోగా కొనుగోలుదారునికి కూడా ఉపశమనం లేకుండాపోయింది. దళారులే రాజ్యమేలుతున్న పరిస్థితి ఏర్పడింది. ఎకరా కొబ్బరి సాగులో దాదాపు 50 నుంచి 55 చెట్లు ఉంటాయి. గతంలో చెట్టు కాయలు తీసుకునేందుకు ఏడాదికి రూ.1200 వరకూ చెల్లించేవారు. ఇప్పుడు దళారులంతా కుమ్మక్కై చెట్టుకు రూ.600 మాత్రమే ఇస్తామని చెబుతున్న పరిస్థితి ఉంది. ఖర్చులు తక్కువగా ఉన్నప్పుడు ధర ఉండేది. ఖర్చులు పెరిగిన తర్వాత ధర తగ్గిపోవడంతో రైతులు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారు. ఎకరా కొబ్బరి సాగుకు రూ.40 వేలకు పైగా పెట్టుబడి అవుతోంది. కాయలు తీసి గుట్టగా వేయడానికి కాయకు దాదాపు రూ.మూడు ఖర్చవుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో కాయ ధర రూ.15 ఇస్తే తప్ప రైతులకు గిట్టుబాటు అయ్యే పరిస్థితి లేకుండాపోయింది. 1992లో కాయ ధర రూ.ఐదు పలికితే సుమారు 30 ఏళ్ల తర్వాత ఇప్పుడు కాయకు రూ.ఏడు ఇస్తే ఏవిధంగా గిట్టుబాటు అవుతుందో ప్రభుత్వం చెప్పాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. అయితే కొబ్బరి రైతులను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కొబ్బరికి గత కొన్నేళ్లుగా తెల్లదోమ, ఎర్రమల్లి వంటి తెగుళ్లు సోకుతున్నాయి. వీటి నివారణకు ఏం చర్యలు తీసుకోవాలో రైతులకు చెప్పే నాథుడే లేకుండాపోయాడు. జిల్లాలో ఇంత పెద్దఎత్తున కొబ్బరి సాగు సాగుతున్నా కొనుగోలు కేంద్రాలు లేకపోవడం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. కొబ్బరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. కొబ్బరి రైతులకు న్యాయం చేయాలంటూ ఏపి రైతుసంఘం ఆధ్వర్యంలో సోమవారం చలో కలెక్టరేట్‌కు పిలుపు ఇవ్వడం ప్రస్తుత పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ప్రభుత్వం ఇప్పటికైనా కొబ్బరి రైతుకు అండగా నిలవాలని అంతా కోరుతున్నారు.

కొబ్బరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

బొబ్బా రమేష్, కొబ్బరి రైతు, ఆంజనేయ నగరం, భీమడోలు మండలం



ఎనిమిదెకరాల్లో కొబ్బరి సాగు చేస్తున్నాను. గతంలో చెట్టుకు రూ.1200 వచ్చేవి. ఇప్పుడు రూ.600కు అడుగుతున్నారు. పెట్టుబడి ఖర్చులు పెరిగిపోతుంటే కొబ్బరి ధర తగ్గిపోతోంది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పిస్తేనే కొబ్బరి రైతులకు న్యాయం జరుగుతోంది. లేకపోతే కొబ్బరి సాగు నుంచి రైతులు తప్పుకునే పరిస్థితి రానుంది.

తెగుళ్లు సోకినా పరిష్కారం చెప్పే నాథుడే లేడు

పానుగంటి అచ్యుతరామయ్య, చొదిమెళ్ల



కొబ్బరి సాగును తెల్లదోమ, ఎర్రమల్లి వంటి తెగుళ్లు దెబ్బతీస్తున్నాయి. వీటి నివారణ చర్యలు గురించి చెప్పే నాథుడే లేకుండా పోయారు. ప్రస్తుతం కొబ్బరి కాయ ధర రూ.ఏడు పలుకుతోంది. కాయ ధర రూ.15 లేకపోతే రైతుకు ఏమాత్రం గిట్టుబాటు కాదు. కొబ్బరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. కొబ్బరి రైతు గురించి ఏ ఒక్కరూ పట్టించుకోకపోవడం ఆవేదన కల్గిస్తోంది.

కొబ్బరి రైతును దెబ్బతీస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలు

కె.శ్రీనివాస్, రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి



విదేశీ కొబ్బరి ఉత్పత్తుల దిగుమతులను కేంద్రం వెంటనే ఆపాలి. కొబ్బరి రైతుకు సరైన ధర కల్పించే విధంగా నాఫెడ్, ఆయిల్‌ఫెడ్‌ను రంగంలోకి దించాలి. కొబ్బరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా చూడాలి. ధరల స్థిరీకరణ పథకాన్ని కొబ్బరికి వర్తింపచేయాలి. కొబ్బరి రైతుల సమస్యను పరిష్కరించకపోతే రైతులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన చేపడతాం.



ఎస్‌టిఎఫ్‌ఐ, యుటిఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు

సిపిఎస్, ఎన్ఇపిని రద్దు చేయాలి

ఎస్‌టిఎఫ్‌ఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు గోపీమూర్తి

యుటిఎఫ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

ప్రజాశక్తి - భీమవరం

సిపిఎస్, ఎన్ఇపిని రద్దు చేయాలని ఎస్‌టిఎఫ్‌ఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు బి.గోపీమూర్తి డిమాండ్ చేశారు. స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎస్‌టిఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు భీమవరంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌టిఎఫ్‌ఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు గోపీమూర్తి, ఎస్‌టిఎఫ్‌ఐ పతాకాన్ని ఆవిష్కరించారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయం నుంచి ప్రకాశం చౌక్ సెంటర్ మీదుగా అంబేద్కర్ చౌక్, యుటిఎఫ్ కాలనీ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని కార్పొరేట్ మయం చేస్తోందని విమర్శించారు. నూతన జాతీయ విద్యా విధాన చట్టం 2020ను తీసుకొచ్చిందని, ఈ చట్టం వల్ల ప్రభుత్వ విద్యారంగం కార్పొరేట్, ప్రయివేటుమయం అయిపోయిందన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి. రామభద్రం, గౌరవాధ్యక్షులు ఎం.మార్కండేయులు, సహాధ్యక్షులు కె.రాజశేఖర్, సహాధ్యక్షురాలు కె.శ్రీదేవి, జిల్లా కార్యదర్శులు సాయిరామ్, కెఎస్.రామకృష్ణప్రసాద్, జి.రామ కృష్ణరాజు, రత్నరాజు, డి.యేసుబాబు, పి.క్రాంతికుమార్, బి.శివ ప్రసాద్, కుమార్ బాబ్జీ, రాష్ట్ర కౌన్సిలర్స్ కృష్ణమోహన్, డి.పద్మావతి పాల్గొన్నారు.

రూ.కోటితో డిఎస్‌పి కార్యాలయ నిర్మాణం

భవనాన్ని ప్రారంభించిన డిజిపి కెవి.రాజేంద్రనాథ్ రెడ్డి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్



నరసాపురంలో డిఎస్‌పి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డిజిపి

పట్టణంలోని 19వ వార్డులో కోటి రూపాయలతో నూతనంగా నిర్మించిన డిఎస్‌పి కార్యాలయం, బంగ్లాను డిజిపి కెవి.రాజేంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన పురాతన భవనాన్ని తొలగించి ఆస్థానంలో సుమారు కోటి రూపాయలతో 4500 చదరపు అడుగుల విస్తీర్ణంతో నూతన భవనాన్ని నిర్మించుకోవడం మంచి తరుణమన్నారు. భవన నిర్మాణానికి 13 మంది దాతలు సహకరించడం అభినందనీయమన్నారు. దీన్నిబట్టి ప్రజలు, పోలీసులకు మధ్య ఉన్న స్నేహపూరిత సత్సంబంధాలు అవగతం అవుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రత కోసం దిశా యాప్‌ను ప్రవేశపెట్టిందని, ఇప్పటి వరకూ రూ.కోటీ 40 లక్షల మంది మహిళలు యాప్‌లో రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. 27 వేల మంది మహిళలు ఈ యాప్ ద్వారా అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహకారాన్ని పొందారని తెలిపారు. ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతల సంరక్షణే ధ్యేయంగా పోలీస్ వ్యవస్థ నిరంతరం శ్రమిస్తోందన్నారు. డిఎస్‌పి కార్యాలయ భవన నిర్మాణానికి దాతల సహకారం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ వ్యవస్థను పటిష్టం చేసిందన్నారు. పోలీసులు అందిస్తున్న సేవలు గొప్పవని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు రేంజ్ డిఐజి అశోక్ కుమార్, ఎస్‌పి యు.రవిప్రకాష్, అడిషనల్ ఎస్‌పిలు సుబ్బరాజు, రవికుమార్, డిఎస్‌పిలు రవి మనోహరాచారి, వీరాంజనేయ రెడ్డి, శరత్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

పాలకొల్లు :డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి శనివారం ఆకస్మికంగా పాలకొల్లు విచ్చేశారు. స్థానిక లైఫ్ ఆసుపత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాలకొల్లు వంటి చిన్న పట్టణంలో ఆధునిక సౌకర్యాలతో ఇటువంటి ఆసుపత్రి ఉండడం ప్రజల అదృష్టన్నారు. ఆయనకు ఆసుపత్రి నిర్వాహకులు తటవర్తి కృష్ణమూర్తి, అడ్డాల వాసు, తెలనాకుల సురేష్, సుధాకర్, రాజు గజమాల వేసి స్వాగతం పలికారు. డిజిపి వెంట ఏలూరు రేంజ్ డిఐజి, జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, సిఐలు డి.రాంబాబు కె.శ్రీనివాస్ పాల్గొన్నారు. నరసాపురంలోని డిఎస్‌పి నూతన ఆఫీస్ ప్రారంభం సందర్భంగా డిజిపి జిల్లా విచ్చేశారు.

సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం ఉధృతం

కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యాన 12 గంటల ధర్నా విజయవంతం

ప్రజాశక్తి - భీమవరం



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

రాష్ట్ర ఫ్యాప్టో దసలవారీ పోరాటంలో భాగంగా ఉపాధ్యాయులు, పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లాలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో చేపట్టిన 12 గంటల ధర్నా విజయవంతమైంది. జిల్లా నలుమూల నుంచి సుమారు 500 మంది ఉపాధ్యాయులు కలెక్టరేట్ వద్దకు చేరుకొని ధర్నాలో పాల్గొన్నారు. విస్సాకోడేరు పెద్ద వంతెన దిగువున ఏర్పాటుచేసిన ధర్నా శిబిరం వద్ద 12 గంటల పాటు నిరసన తెలిపారు. సిపిఎస్, నూతన విద్యా సంస్కరణలు , జిఒ 117ను రద్దు చేయాలని, ప్రిన్సిపల్, విద్యాశాఖ అధికారి ప్రవీణ్ ప్రకాష్ వైఖరిని ఖండిస్తూ, బదిలీలు ప్రమోషన్లలో వెళ్లిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని, ఉపాధ్యాయులకు బోధ నేతర పనులు చెప్పొద్దని, ఆన్‌లైన్ వర్క్‌కు ప్రత్యేక సిబ్బందిని నియమించాలని ఫ్యాప్టో జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించని పక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఫ్యాప్టో నాయకత్వం ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఈ సందర్భంగా జరిగిన ధర్నా సభకు ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ బిహెచ్ జవహర్లాల్ రాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయి శ్రీనివాస్, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి మాట్లాడారు. పాదయాత్ర సమయంలో జగన్ సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పి అధికారం చేపట్టాక ఆ మాటే మరిచారన్నారు. ప్రిన్సిపల్, విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌ప్రకాష్ ఉపాధ్యాయుల పట్ల అవలంబిస్తున్న వైఖరి అత్యంత దారుణంగా ఉందన్నారు. ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేయడమే కాకుండా గౌరవ మర్యాదలకు భంగం వాటిల్లేలా మాట్లాడడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. మూడు నెలల నుంచి జీతాలు అందక ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిఒ 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం, ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.రామచంద్రరావు, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.ప్రకాశం, బివి.నారాయణ, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రమణ, డిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు, బిటిఎ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వరరావు, సిపిఎస్ సంఘం జిల్లా అధ్యక్షులు వీరవల్లి వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్, ఎఐటియుసి నాయకులు కొనాల భీమారావు, మహిళా నాయకులు బాలా కుమారి, కె.శ్రీదేవి మాట్లాడారు. ఈ ధర్నాలో 500 మందికిపైగా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మణిపూర్ మారణహోమాన్ని నిరసిస్తూ శాంతి ర్యాలీ

సిపిఎం సంఘీభావం

ప్రజాశక్తి - ఆచంట



ఆచంట కచేరి సెంటర్లో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

మణిపూర్‌లో కుకీలపై నెలల తరబడి జరుగుతున్న హింసను అరికట్టడంలో బిజెపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. స్థానిక కచేరీ సెంటర్లో శనివారం క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన శాంతి ర్యాలీకి సిపిఎం బృందం సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ మణిపూర్‌లో మైనార్టీలుగా ఉన్న కుకీ క్రైస్తవ సోదరి, సోదరులపై జరుగుతున్న అఘాయిత్యాలు అన్నీఇన్నీ కావన్నారు. మణిపూర్‌లో హింసకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రదర్శనలకు సిపిఎం, సిపిఐ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నాయన్నారు. నెలల తరబడి జరుగుతున్న మారణకాండను దేశం మొత్తం ఖండించాలన్నారు. దేశాన్ని ఏలుతున్న పాలకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న వారే మణిపూర్‌లో కూడా అధికారంలో ఉన్నారన్నారు. వారి ప్రోత్సాహం, అండదండతోనే క్రైస్తవ కుకీలపై అఘాయిత్యాలు, దాడులు జరుగుతున్నాయన్నారు. స్త్రీలను వివస్త్రలను చేసి, అత్యాచారం, హత్యచేసి, వారి కుటుంబ సభ్యులను హతమార్చిన సంఘటన ప్రపంచాన్నే నివ్వెరపోయేలా చేసిందన్నారు. ప్రపంచ దేశాలు సైతం ఈ ఘటనల్ని ఖండించాయన్నారు. మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని జరిగే కార్యక్రమాలకు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, జిల్లా కమిటీ సభ్యులు జె.సత్యనారాయణ, పెనుమంట్ర మండల కార్యదర్శి కె.సుబ్బరాజు, పోడూరు మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్, ఆచంట మండల నాయకులు వద్దిపర్తి అంజిబాబు, చిర్రా నరసింహమూర్తి, మచ్చా సుబ్బారావు, చొప్పల మోహన్, తలుపూరి బుల్లబ్బాయి, ఎం.బ్రహ్మయ్య, వి.శ్రీను పాల్గొన్నారు.

ఖాళీ కంచాలతో వరద బాధితుల నిరసన

ప్రజాశక్తి - యలమంచిలి



వరద బాధితులతో కలిసి ఖాళీ కంచాలను మోగిస్తున్న ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు

మండలంలోని కనకాయలంక, పెదలంక గ్రామాల్లో వరద బాధితులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయమూ అందలేదని శనివారం ఆయా గ్రామస్తులు ఖాళీ కంచాలతో నిరసన తెలిపారు. నిరసనకు సంఘీభావం తెలిపిన పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ వరదల సమయంలో సుమారు 15 రోజులపాటు లంక గ్రామాల ప్రజలు నరకయాతన అనుభవించారన్నారు. ఆ సమయంలో కనీసం బాధితులకు ఒక్క పూట కూడా భోజనం పెట్టలేదని విమర్శించారు. ఒకపక్క ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రతి కుటుంబానికీ 2000 రూపాయల ఆర్థిక సాయం అందిస్తున్నామని ఆర్భాటంగా ప్రచారం చేస్తున్నారని, యలమంచిలి మండలంలో ఏ ఒక్కరికీ ఇప్పటివరకూ ఆర్థిక సాయం ఇవ్వలేదని తెలిపారు. ఇప్పటికైనా బాధితులను ప్రభుత్వం ఆదుకోకపోతే లంక గ్రామాల ప్రజల ఆకలి కేకలు ఉద్యమం మరింత ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు, తాళ్ల నాగరాజు, ముస్కుడి రాంబాబు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి : మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - తణుకు


ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటి భావితరాలకు ఆరోగ్యవంతమైన వాతావరణం అందించే బాధ్యత తీసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శనివారం పట్టణంలోని 14వ వార్డులో నా మట్టి - నా దేశం కార్యక్రమంలో భాగంగా మంత్రి మొక్కలు నాటి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ దేశం పట్ల భక్తి, పెద్దల పట్ల గౌరవం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలి కార్పొరేషన్ ఛైర్మన్ గుబ్బల తమ్మయ్య, మున్సిపల్ కమిషనర్ కెటి.సుధాకర్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోషేనురాజుచే ప్రార్థనామందిరం ప్రారంభం

భీమవరం రూరల్:భీమవరం మండలంలోని గొర్లమూడిలో సుమారు రూ.కోటీ 50 లక్షల నిధులతో నిర్మించిన ఎపి ఫానియా లూథరన్ ప్రార్థనా మందిరాన్ని శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో సుందరంగా ప్రార్థనా మందిరాన్ని నిర్మించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోస్ట్ రైట్ రెవ కెఎఫ్ పరదేశిబాబు, పాస్టర్ ప్రవీణ్‌కుమార్, పొలమూరి సుందర్రావు, తోటే రత్నకుమార్, ప్రేమ్‌ప్రకాష్ పాల్గొన్నారు.

ఓటర్ల సర్వేలో నిబంధనలు పాటించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణలో నిబంధనల ప్రకారం నడుచుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి బిఎల్‌ఒలను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డితో కలిసి ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితాలో భాగంగా ఇంటింటి సర్వేపై ఎఇఆర్‌ఒలు, బిఎల్‌ఒలు, తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా 2024లో భాగంగా ఇంటింటి సర్వేపై బిఎల్‌ఒలు, నియోజకవర్గ, మండలాల ప్రత్యేక అధికారులు ఈ నెల 21వ తేదీలోగా ఇంటింటా సర్వే నూరుశాతం పూర్తి చేయాలన్నారు. ఇంటింటా సర్వేకు బిఎల్‌ఒలతోపాటు బిఎల్‌ఎలు మాత్రమే వెళ్లాలన్నారు. ఇతరులను తీసుకెళ్లడానికి వీల్లేదన్నారు. అనంతరం పోలింగ్ స్టేషన్ పరిధిలో గృహాలను పరిశీలించారు. ప్రతి సంవత్సరమూ జనవరిలో ఓటరు జాబితా విడుదల చేయడం జరుగుతుందని, 18 సంవత్సరాలు నిండిన వారిని ఓటర్ జాబితాలో చేర్చడం, చనిపోయిన, వివాహమైన వారిని తొలగించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, ఆర్‌డిఒ దాసి రాజు, ఎఇఆర్‌ఒలు, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ నరసింహారావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - వీరవాసరం

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సంఘం సమావేశం మంగతాయారు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం వేతనాలు, బిల్లులు సక్రమంగా చెల్లించకుంటే కార్మికులు భోజనం ఎలా వండి పెడతారని ప్రశ్నించారు. ప్రాథమిక పాఠశాలకు రు.6.70 పైసలు ఇస్తున్నారని, గుడ్డు పేరుతో రెండు రూపాయలు కట్ చేసి రూ.4.70 పైసలు ఇస్తున్నారని తెలిపారు. ఈ విధంగా చెల్లిస్తే పిల్లలు తక్కువ ఉండటం వల్ల నిర్వాహకులకు గిట్టుబాటు కావడం లేదని, ఈ పరిస్థితిని ప్రభుత్వం పరిగణలోకి తీసుకోకుండా వ్యవహరిస్తోందని తెలిపారు. దీనికితోడు పాఠశాలలో ఇతర పనులు కూడా కార్మికులకు అప్పజెబుతోందన్నారు. వేతనాలు సక్రమంగా చెల్లించాలని, పెండింగ్ బిల్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రత్నకుమారి, కార్యదర్శి ధనలక్ష్మి, నాయకులు శ్రీను, నాగమణి, సుబ్బమ్మ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు

తాడేపల్లిగూడెం:విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు తెలిపారు. శశి ఇంజినీరింగ్ కళాశాలలో యాంటీ రాగింగ్ దినోత్సవం సందర్భంగా ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే పోలీసు వారు కఠిన చర్యలు తీసుకుంటారని, తద్వారా తమ జీవితం అగమ్యగోచరంగా మారుతుందని తెలిపారు. ట్రాఫిక్ ఎస్ఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఒకసారి ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణలో ర్యాగింగ్‌కు పాల్పడినట్టు రుజువైతే చదువు కోడానికి, ప్రభుత్వ ఉద్యోగం పొందడానికి అవకాశం కోల్పోతారన్నారు. రిటైర్డ్ ఎంఇఒ రామరాజు మాట్లాడుతూ విద్యార్థులు మంచి ప్రవర్తనతో మెలగాన్నారు. ప్రిన్సిపల్ మొహమ్మద్ ఇస్మాయిల్ మాట్లాడుతూ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి అన్నమని, పట్టణ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.అప్పిరెడ్డి, సీనియర్ అడ్వకేట్ డిఎస్.రామారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు గోపాలన్

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి పోరాటం

సిఐటియు జిల్లా అధ్యక్షులు గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

అంగన్‌వాడీలు తమ సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే దఫాదఫాలుగా ఆందోళన చేపట్టారని, ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోతే మరో పోరాటానికి సిద్ధంగా ఉన్నారని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ హెచ్చరించారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో అంగన్‌వాడీలకు శనివారం నిర్వహించిన మాస్ తరగతుల్లో గోపాలన్ పాల్గొని మాట్లాడారు. ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై సిఐటియు నిరంతరం ఆందోళన కొనసాగిస్తుందన్నారు. చట్టాల అమలులో సిఐటియు కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఐక్య పోరాటంతోనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఐసిడిఎస్‌లో మాతా శిశు సంక్షేమం కోసం కట్టుబడి పని చేస్తూ, తల్లులు, రాబోయే తరం పిల్లల సంరక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్తూ అంగన్‌వాడీ శక్తికి మించి పని చేస్తున్నారన్నారు. ఫలితంగా శిశు, బాలింత మరణాలు బాగా తగ్గాయన్నారు. పౌష్టికాహార లోపం క్రమక్రమంగా తగ్గుతూ వస్తుందని ప్రభుత్వ రికార్డులే చెబుతున్నాయన్నారు. ఐసిడిఎస్‌కు నిధులు పెంచి అంగన్‌వాడీలను సంస్థాగతం చేస్తే మరింత ఫలితం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.వాసుదేవరావు, డి.కల్యాణి, ఎంబి హసీనా, మార్తమ్మ అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

మండల ప్రజా పరిషత్ స్కూల్లో పనిచేస్తున్న శానిటరీ వర్కర్లు, స్వీపర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు నాయకులు జవ్వాది శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పాలకొల్లులో పి.సునీత అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడారు. పేరుకు పార్ట్ టైం అని చెప్పి ఫుల్ టైం పని చేయిస్తున్నారన్నారు. జీతం బెత్తెడు చాకిరీ బారెడుగా వర్కర్స్ పరిస్థితి ఉందని వాపోయారు. పనికి తగ్గ వేతనాలు ఇవ్వాలని కోరారు. పనికి అవసరం ఉన్న పనిముట్లు అందించాలని, పని భద్రత కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సాదే సుజాత, బొక్కా వెంకటరమణ, బీరా చంద్రకాంత, సుందరమ్మ, సునీత పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులు పంపిణీ

ప్రజాశక్తి - వీరవాసరం

ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన ఆహారాన్ని తినడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని జిల్లా కో-ఆర్డినేటర్ అరుణకుమారి అన్నారు. నవడూరులో రైతు భరోసా కేంద్రం వద్ద సీడ్2సీడ్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ కాండం తొలుచు పురుగులను నివారించడానికి రైతులు పొలాల్లో లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

రీడింగ్ రూమ్ ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మైత్రి కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్యాంక్ కాలనీలో ఏర్పాటు చేసిన గ్రంధి శ్రీనివాస్ రీడింగ్ రూమ్‌ను ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్, మాజీ ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ పుస్తకాలు మేధస్సును పెంచుతాయన్నారు. ప్రతిఒక్కరూ పుస్తకాలను, గ్రంథాలను అనుసరించాలన్నారు. మైత్రి కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఈ ప్రాంతంలో రీడింగ్ రూమ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

'రాష్ట్రాభివృద్ధి టిడిపితోనే సాధ్యం'

ప్రజాశక్తి - మొగల్తూరు

రాష్ట్ర అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని ఆ పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు సిరిగినీడి రాజ్యలక్ష్మి అన్నారు. మొగల్తూరు పంచాయతీ పరిధి కొత్తకాయలతిప్పలో శనివారం నిర్వహించిన మహాశక్తి కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రతి ఇంటికి వెళ్లి మహిళలతో మాట్లాడారు. రాజమండ్రి మహానాడులో చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టోను మహిళలకు వివరించారు.

భీమవరం రూరల్ : పట్టణంలోని రెస్ట్ హౌస్ రోడ్డు 22, 27 వార్డుల్లో శనివారం నిర్వహించిన మహాశక్తి రథచైతన్య యాత్ర కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి పాల్గొని మాట్లాడారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగల సత్తా చంద్రబాబుకే ఉందన్నారు.

చేనేత నాయకులపై దాడి అమానుషం

ప్రజాశక్తి - పెనుమంట్ర

చీరాలలో చేనేత సీనియర్ నాయకులు బండ్ల వెంకటేశ్వరరావు(బాబు)పై అమానుష దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మార్టేరుకు చెందిన జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర యువజన అధ్యక్షుడు అల్లాడ సూర్య భాస్కరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. చేనేతలకు అన్యాయం చేస్తే సహించబోమన్నారు.

ఘనంగా ఎస్ఆర్.రంగనాథన్ జయంతి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్.రంగనాథన్ జయంతిని శనివారం గ్రంథాలయ దినోత్సవంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ పి.లక్ష్మీసరోజ మాట్లాడుతూ ఎస్ఆర్.రంగనాథన్ జీవిత చరిత్ర, ఉద్యోగం, ప్రవృత్తికి సంబంధించిన అనేక విషయాలను విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ ఏ సమయంలోనైనా విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు, మేనేజర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడిగా వాసు

ప్రజాశక్తి - ఆకివీడు

స్థానిక జ్యోతి రెస్టారెంట్ (అయ్యర్ భోజన హోటల్) అధినేత నాగరాజు ఉదయ్ భాస్కర్ (వాసు) ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా శాఖ ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఇటీవల తాడేపల్లిగూడెంలో జరిగిన సంఘ జిల్లా స్థాయి కార్యక్రమంలో నిర్వహించిన ఎన్నికల్లో ఆయనను ఉపాధ్యక్షుడుగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఆయన పదవీ బాధ్యతలను ఆదివారం ఉదయం తాడేపల్లిగూడెంలో స్వీకరించనున్నారు.

నేరాలు - ఘోరాలు

దుంపగడప కళాశాలలో చోరీ

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలోని దుంపగడప ఆంధ్ర కేసరి ప్రకాశం శత జయంతి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నీరు తోడుకునే మోటార్ చోరీకి గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 11వ తేదీ గురువారం రాత్రి ప్రిన్సిపల్ కార్యాలయ గది, ఫిజిక్స్ లేబరేటరీ గదుల తాళాలు పగలగొట్టారు. అక్కడ వారికి ఏమీ దొరకకపోవడంతో ఆవరణలో ఉన్న నీరు తోడుకునే మోటార్‌ను అపహరించుకుపోయారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపల్ ఎం.బ్రహ్మం చేసిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సత్యసాయి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మహిళతో అసభ్య ప్రవర్తన : వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - ఉండి

మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదైన సంఘటన మండలంలోని ఆరేడు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరేడు గ్రామానికి చెందిన ఓగిరాల జ్యోతి ఇంట్లో ఒంటరిగా ఉండగా ఆమె ఇంటి పక్కనే నివసిస్తున్న పిట్టా సాయి అనే వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి ఒంటరిగా ఉన్న ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడని జ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికి నగదు జమ : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ఇటీవల గోదావరి వరద కారణంగా పునరావాసం పొందిన ప్రతి కుటుంబానికి నగదు జమ చేసినట్లు కలెక్టర్ పి.ప్రశాంతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొంది తిరిగి ఇంటికి వెళ్లే వారికి ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి కుటుంబానికి రూ.2 వేలు, కుటుంబంలో ఒక్కరే ఉంటే రూ.వెయ్యి ఆయా కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందిన దొడ్డిపట్ల గ్రామంలోని 204 కుటుంబాలకు రూ.2 వేల చొప్పున, సింగిల్ పర్సన్స్ ఎనిమిది మందికి రూ.వెయ్యి చొప్పున అందించినట్లు చెప్పారు. గతేడాది 72 అడుగుల మేర వరద రావడంతో చాలా గ్రామాల్లో ఇళ్లల్లోకి నీరు



చేరిందని, గత నెలలో వరదలకు ఆ పరిస్థితి లేదన్నారు. వరద 54 అడుగులు రావడం వల్ల చాలా గ్రామాల్లో ఇంట్లోకి నీరు ప్రవేశించలేదని, ఇంటి చుట్టూ ఉన్న పల్లపు ప్రాంతాల్లో మాత్రమే నీరు చేరిందని తెలిపారు. యలమంచిలి మండలంలోని కనకాయలంక, పెదలంక, లక్ష్మీపాలెం, యలమంచిలి లంక, ఏనుగువాని లంక, గంగడపాలెం, అబ్బిరాజుపాలెం, నార్ని మెరక, బాడవ, శిరగాలపల్లి, కంచుస్తంభంపాలెం, బూరుగుపల్లి గ్రామాల ప్రజలు ఇంటి నుంచి బయటకు వచ్చి రాకపోకలు సాగించడానికి అంతరాయం ఏర్పడినందున వారందరికీ ఇంటి వద్దనే పెద్ద ఎత్తున నిత్యావసర వస్తువులు, తాగునీరు, వైద్య సహాయం అందించినట్లు చెప్పారు. 4,023 కుటుంబాలకు నిత్యావసర సరుకులు చౌక దుకాణాల ద్వారా గ్రామ రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో ఉచితంగా పంపిణీ చేసినట్లు చెప్పారు. ప్రతి కుటుంబానికి 25 కేజీల బియ్యం, ఒక్కొక్క కేజీ చొప్పున కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళదుంపలు, వంటనూనె ఒక లీటరు, వంకాయలు, పచ్చిమిర్చి కూడా పంపిణీ చేసినట్లు చెప్పారు. వరద కారణంగా లంక గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడకూడదని వరద హెచ్చరిక జారీ చేసినప్పటి నుంచి అధికార యంత్రాంగం అప్రమత్తమై తగు ముందస్తు చర్యలను చేపట్టిందన్నారు. వరద సహాయ చర్యల్లో ఎటువంటి లోటు పాట్లు లేకుండా వరద తొలగే వరకూ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని చెప్పారు. వరద తొలగిన అనంతరం మెరుగైన పారిశుధ్య కార్యక్రమాలను కూడా చేపట్టి ఆయా గ్రామాల ప్రజలను సురక్షితంగా ఉంచినట్లు కలెక్టర్ తెలిపారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

వర్ధంతి సభలో సిపిఎం నేతలు


ఆచంటలో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - ఆచంట

ప్రజల కోసం ప్రాణాలు సైతం అర్పించేవారు అతి తక్కువ మందే ఉంటారని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. ఆచంట కచేరి సెంటర్‌లో అమర వీరులైన ప్రేరేప మృత్యుంజయుడు, తాళ్ల బసవ మల్లయ్య, దిగుపాటి ప్రకాశరావు, నెక్కంటి రామదాసు, కరుటూరి సత్యనారాయణల వర్ధంతి సభ సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోపాలన్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. తొలుత ఆచంట వేమవరంలో అమరవీరుల స్థూపం వద్ద నుంచి మోటర్ సైకిల్ ర్యాలీగా బయలుదేరి, పెనుమంచిలి మీదుగా ఆచంట కచేరి సెంటర్‌కు చేరుకున్నారు. అనంతరం అమర వీరుల చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో బలరాం మాట్లాడుతూ ఆచంటలో ప్రేరేప మృత్యుంజయుడు, వేమవరంలో తాళ్ల బసవ మల్లయ్య అగ్రగన్యులన్నారు. వారి బాటలోనే దిగుపాటి ప్రకాశరావు, నెక్కంట రామదాసు, కరుటూరి సత్యనారాయణ వంటి త్యాగజీవులందరూ తుది శ్వాస విడిచే వరకు బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం పని చేశారన్నారు. దేశంలో మతోన్మాద, కార్పొరేట్, రాజకీయ శక్తులు పేద సామాన్య ప్రజానీకంపై మోయలేని భారాలను మోపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, ఉద్యోగ కార్మికులు, చేతివృత్తులు, చిరు వ్యాపారులు, మహిళలు, విద్యార్థి యువజనులకు నష్టం కలిగించే విధానాలపై రాజీలేని పోరాటాలను నిర్వహించడంలో సిపిఎం అగ్రభాగాన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సూరినీడి వెంకటేశ్వరరావు, సిఐటియు మండల కార్యదర్శి వర్ధిపర్తి అంజిబాబు, పోడూరు, పెనుమంట్ర మండల కార్యదర్శులు, కె.సుబ్బరాజు, పిల్లి ప్రసాద్, చిర్రా నరసింహమూర్తి, మచ్చా సుబ్బారావు, చొప్పల మోహన్, తలుపూరి బుల్లబ్బాయి, ఎం. బ్రహ్మయ్య, వి.శ్రీను పాల్గొన్నారు.

స్వాతంత్ర సమర వీరులను స్మరించుకోవాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్వాతంత్ర్య సమరంలో ప్రాణ త్యాగాలు చేసిన వీరులను స్మరించుకుంటూ వారి స్ఫూర్తిని పొందాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. నా మట్టి - నా దేశం కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో క్విట్ ఇండియా స్వాతంత్రోద్యమ అమరవీరుల స్థూపం వద్ద నిర్వహించిన వీరులకు వందనం కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు నా మట్టి-నా దేశం కార్యక్రమంలో భాగంగా ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి 20వ తేదీ వరకు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. తొలుత అమరవీరులను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. క్విట్ ఇండియా స్వాతంత్రోద్యమ అమరవీరుల స్థూపం పున:నిర్మాణ కమిటీ సభ్యులు యిందుకూరి ప్రసాదరాజు, చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు, అరసవల్లి బాల సుబ్రహ్మణ్యం, బొండా వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో పలువురి దాతల సహకారంతో సుమారు రూ.7.50 లక్షలతో క్విట్ ఇండియా స్థూపం పున:నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. మెయిన్ రోడ్డు వైపు స్థూపం స్పష్టంగా కనిపించేలా ఆర్చి, స్టీల్ గేటు ఏర్పాటుకు ఓబిలిశెట్టి పట్టాభి రామయ్య రూ.1.50 లక్షలు విరాళం అందించారన్నారు. స్వాతంత్ర సమరయోధులు పస్తుల సాగర్ మనవడు పస్తుల హరిప్రసాద్, అడవి బాపిరాజు మనవడు కెకెఆర్.కృష్ణమోహన్‌లను కలెక్టర్ చేతులమీదుగా శాలువా కప్పి సన్మానించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడే విధంగా మొక్కలు నాటాలని భీమవరం ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి నరసింహరాజు అధ్యక్షతన శనివారం నాదేశం-నా మట్టి కార్యక్రమం నిర్వహించారు. తొలుత అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం మండల పరిషత్ అవరణలో మొక్కలునాటారు.

ఉండి : ఉండి గోరింతోట, పడవలవానిపేట, రాజులపేట, ఉప్పుగుంట ప్రాంతాల్లో శనివారం నిర్వహించిన మహిళా శక్తి కార్యక్రమంలో ఎంఎల్‌ఎ మంతెన రామరాజు పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు రూపొందించిన మినీ మేనిఫెస్టో ప్రతిఒక్కరికి ఆమోదయోగ్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, మండల మహిళా అధ్యక్షురాలు వత్సవాయి సుజాత, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కరిమెరక తులసి, ఉండి మాజీ సర్పంచి ముదునూరి విజయకృష్ణంరాజు, నాయకులు జుత్తిగ శ్రీనివాస్, హరి నాయుడు, కాగిత బుజ్జి, మంతెన సాయి లచ్చిరాజు, గొల్ల విక్టర్‌బాబు, పెద్దింటి నాగలక్ష్మి, వేగేశ్న అనంతలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్గానిక్ ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రతి మనిషి సంపూర్ణ ఆరోగ్యానికి ఆర్గానిక్ పదార్థాలతో చేసిన వంటకాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రముఖ వైద్యురాలు ఉద్దరాజు ఇందుమతి అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో అరోమా ఆయిల్స్ ప్రయోజనాలపై ఒకరోజు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సీతారామరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఇందుమతి మాట్లాడుతూ మానవుల్లో హరింపోయిన శక్తిని నింపుకోవడానికి ఆహారం తీసుకుంటామన్నారు. ఆ ఆహార పదార్థాల తయారీలో ఎటువంటి రసాయనికాలు లేని ఆర్గానిక్ పదార్థాలు ఉపయోగించి, సాధారణ పరికారాలతో వంట చేసినట్లయితే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఆహార పదార్థాల్లో కాలుష్యం పెరగటమే అనారోగ్యాలకు కారణమన్నారు. పండ్లు, ఆహార పదార్థాలన్నిటిపైన రసాయనికాలు అధికంగా ఉపయోగించటంతో ఎంతో నష్టాన్ని కలిగిస్తున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి వాటిని అధిగమించేందుకు అందుబాటులో ఉన్న అరోమా ఆయిల్ చికిత్స విధానాన్ని ఆచరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ బిహెచ్‌విఎన్. లక్ష్మి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.సత్యనారాయణరాజు, కరణం రామకృష్ణ, ముంబైకి చెందిన అభిషేక్, ఆకుల విజయభాస్కర్, నరేందర్ పాల్గొన్నారు.

శ్రీ వాసవిలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం శ్రీ వాసవి ఇంజినీరింగ్ అటానమస్ కళాశాలలో రెండో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. బీటెక్, ఎంటెక్, ఎంబిఎ డిగ్రీలు పూర్తి చేసిన విద్యార్థులకు ప్రొవిజినల్స్ ప్రదానం చేశారు. అటానమస్ హోదాలో తమ చదువును దిగ్విజయంగా పూర్తి చేసుకుని బయటకు వెళ్తున్న విద్యార్థులకు డిగ్రీ ప్రదానం చేయడానికి నిర్వహించే రెండో గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం, కాకినాడ ఉపకులపతి ప్రొఫెసర్ జివిఆర్.ప్రసాదరాజు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ ఇంజినీరింగ్ విభాగాల్లో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు బంగారు పతాకాలను, ప్రశంసాపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ జెఎన్‌టియుకె విశ్వ విద్యాలయానికి అనుబంధంగా ఉన్న అత్యుత్తమ ఇంజినీరింగ్ కళాశాలల్లో శ్రీ వాసవి ఒకటని, అకాడమిక్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లతో పాటు పరిశోధన రంగంలో కూడా ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు విద్యతో పాటు విలువలను కూడా నేర్చుకోవాలని సూచించారు. గౌరవ అతిథిగా హాజరై హెక్సావేర్ సంస్థ ప్రధాన హెచ్ఆర్ సౌగటా సేన్ మాట్లడుతూ విద్యార్థులు విద్యను అభ్యసించడంలో స్మార్ట్‌గా ఉండాలన్నారు. 3ఎఫ్ లిమిటెడ్ సంస్థ టెక్నికల్ డైరెక్టర్, కళాశాల అధ్యక్షులు ఒ.పి.గోయెంక మాట్లాడుతూ విద్యార్థులుగా సాధించిన విజయాలు దేశ ప్రగతికి సోపానాలు కావాలన్నారు. కళాశాలలో కేవలం అకాడమిక్‌గానే కాకుండా అన్ని అంశాల్లోనూ ప్రతిభ కనబరచి 2023 సంవత్సర ఉత్తమ విద్యార్థిగా ఎంపికైన జె.యజ్ఞరమ్యశ్రీకి బంగారు పతాకాన్ని అందించారు. ఆయా ఇంజినీరింగు విభాగాల్లో ప్రథములుగా నిలిచిన విద్యార్థులకు బంగారు పతాకాలు, ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలక వర్గ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు, ప్రిన్సిపల్ డాక్టర్ రత్నాకరరావు, వివిధ ఇంజినీరింగ్ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కెఆర్‌లో వర్క్‌షాపు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విదేశీ విద్యకు వెళ్లే విద్యార్థులకు ఇంగ్లీష్ భాషలో చక్కగా వినటం, మాట్లాడటం వంటి నైపుణ్యాన్ని అధ్యాపకులు అందించాలని ఎడ్యుకేషన్ టెస్టింగ్ సర్వీసెస్ (ఇటిఎస్) అకాడమిక్ హెడ్ ఢిల్లీ రష్మీ గేరా అన్నారు. టోఫెల్ వంటి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి శిక్షణ అందించాలనే అంశంపై భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంగ్లీష్ అధ్యాపకులకు నిర్వహించిన ఒక్కరోజు వర్క్ షాపులో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఇంగ్లీష్, ఫారిన్ లాంగ్వేజెస్ హెడ్ డాక్టర్ బిహెచ్‌విఎన్.లక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణమరాజు, డాక్టర్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ బహుజన సమాఖ్య వార్షికోత్సవం

కాళ్ల : దళితులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు అంబేద్కర్ అని ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ బహుజన సమైక్య సంఘం అధ్యక్షులు, ఫౌండర్ సోడదాసి గంగయ్య అన్నారు. అంబేద్కర్ విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఆయన ఆశయాన్ని కొనసాగించేందుకు ఈ సమైక్య కృషి చేస్తుందన్నారు. సీసలి గ్రామంలో ఈ నెల 13వ తేదీ ఆదివారం నాలుగు గంటలకు సీసలి గ్రీన్ వ్యూ ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాలులో ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ బహుజన సమైక్య రెండో వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి భీమవరం ఆర్‌డిఒ దాసిరాజు, జిల్లా విద్యా శాఖ అధికారి ఆర్‌వి.రమణ, ఆకివీడు సర్కిల్ సిఐ సత్యనారాయణ తదితర ప్రముఖులు ముఖ్య అతిథులుగా విచ్చేస్తారన్నారు. ఈ సమైక్య విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఉండి, ఆకివీడు, పాలకోడేరు, కాళ్ల మండలాల్లో పదో తరగతిలో మొదటి స్థానం సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందించి సత్కరిస్తామన్నారు. కాళ్లకూరు గ్రామానికి చెందిన దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ దాట్ల వెంకటరామరాజుకు రాజ రామ్మోహన్‌రాయ్ సేవా రత్న అవార్డును అందించి సత్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతిఒక్కరు పాల్గొవాలని కోరారు.

ఘనంగా ఎఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఎఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక మెంటేవారితోటలో ఉన్న బిసి కళాశాల బాలుర హాస్టల్‌లో ఎఐఎస్ఎఫ్ పతాకాన్ని రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు చెల్లబోయిన రంగారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రంగరావు మాట్లాడుతూ 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో నగరంలో ఎఐఎస్ఎఫ్ ఆవిర్భవించిందని వారు తెలిపారు. ఎఐఎస్ఎఫ్ గత ఎనిమిది దశాబ్దాలుగా విద్యారంగంలో సమూల మార్పులను డిమాండ్ చేస్తూ త్రి కరణ శుద్ధిగా అలుపెరగని పోరాటాలు చేసి ఎన్నో ఫలితాలు సాధించిందన్నారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యావ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేశాయన్నారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి టి.అప్పల స్వామి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అందులో బాగంగా జిల్లావ్యాప్తంగా ఉన్న సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో ఎఐఎస్ఎఫ్ మాజీ నాయకులు మల్లుల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు గంటా పవన్, కర్రి గౌతమ్ పాల్గొన్నారు.

పాలకొల్లు : ఎఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక ఆదిత్య జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి శనివారం జెండా ఆవిష్కరించారు. ఈ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్.సుందర్ పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా విద్యారంగ సమస్యలపై ఎఐఎస్ఎఫ్ చేస్తున్న పోరాటాల గురించి విద్యార్థులకు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థి లోకం ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ కార్యదర్శి బి.పెద్దిరాజు, ఆర్.మణిదీప్, ఎఐఎస్ఎఫ్ పట్టణ నాయకులు రాంప్రసాద్, సంతోష్, ప్రసన్న, చరణ్ పాల్గొన్నారు.

సూర్యతేజ దంపతులకు సత్కారం

ప్రజాశక్తి - భీమవరం

నరసాపురం సబ్ కలెక్టర్‌గా పని రోజుల్లోనే మంచి అధికారిగా ఎం.సూర్యతేజ గుర్తింపు పొందడం అభినందనీయమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ ఉద్యోగోన్నతి బదిలీపై ఏలూరు జిల్లా కోటరామచంద్రపురం ఐటిడిఎ పిఒగా వెళ్లిన సందర్భంగా జెసి, జిల్లా వివిధ శాఖల అధికారులతో కలిసి శనివారి జిల్లా కలెక్టరేట్‌లో సూర్యతేజ దంపతులకు ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సమావేశంలో జెసి ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, డిఆర్ఒ కె.కృష్ణవేణి, ఆర్‌డిఒ దాసిరాజు, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


సూర్యతేజ దంపతులను సత్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

నరసాపురం టౌన్ : నరసాపురం హైవే ఇన్‌లో నిర్వహించిన ఆత్మీయ వీడ్కోలు సభకు ప్రశాంతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెవెన్యూ శాఖ సూర్యతేజకు ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు.

పలుగ్రామాల్లో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - కాళ్ల

గ్రామపంచాయతీల నిధులను వైసిపి దారి మళ్లించి గ్రామాల్లో అభివృద్ధి లేకుండా చేసిందని ఎంఎల్‌ఎ మంతెన రామరాజు అన్నారు. మండలంలోని మాలవానితిప్ప, గోగుతిప్ప, ఎస్‌సి బోస్ కాలనీ, ఇసుకలంక గ్రామాల్లో శనివారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ ఇంటింటికి వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంఎల్‌ఎ మాట్లాడుతూ వైసిపి ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే అన్ని తరగతుల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు జివి.నాగేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు తోట ఫణిబాబు, వీరవల్లి శ్రీనివాసరావు, సాగిరాజు సోమరాజు, మంతెన శ్రీనివాసరాజు, అల్లూరి దొరయ్యచౌదరి, కాలువ లక్ష్మి పాల్గొన్నారు.

మోడీని గద్దె దింపాలి

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న ప్రధాని మోడీని సాగనంపాలని సిఐటియు మండల కార్యదర్శి కె.తవిటినాయుడు అన్నారు. స్థానిక రైస్ మిల్ వర్కర్ మేస్త్రీల సమావేశం స్థానిక సంఘ కార్యాలయంలో శనివారం బొర్రా శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తవిటినాయుడు మాట్లాడుతూ కార్మిక చట్టాలను కాలరాసి కార్మికుల జీవితాలను ఆదాని, అంబానీలకు బానిసలుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం చూస్తుందన్నారు. జనసేన, టిడిపి, వైసిపిలు కేంద్రానికి మద్దతుగా వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టాలన్నారు. అనంతరం ఆ మూడు పార్టీలను ఎండగట్టే అంశాలను ప్రచురించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మేస్త్రీల మండల అధ్యక్షులు పెంకి అప్పారావు, ఈశ్వరరావు, బొర్రా సత్యం, నడిపూడి నాగమ్మ, తంపర రూపాదేవి, భాస్కరరావు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల పరిశీలన ప్రక్రియ

ప్రజాశక్తి - ఉండి

ఓటర్ల పరిశీలన ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని బూత్ లెవెల్ అధికారులకు ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎస్.వీరాస్వామినాయుడు సూచించారు. ఉండి మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులకు శనివారం శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాస్వామినాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్క బూత్ లెవెల్ అధికారి ఓటర్ల పరిశీలనకు వెళ్లినప్పుడు ఓటరు ఆధార్‌కార్డు, అడ్రస్ ప్రూఫ్ తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. మండలంలో ఓటర్ కార్డు చేర్పులు, మార్పులు, తొలగింపులు వంటి సవరణలకు కచ్చితంగా అడ్రస్ ప్రూఫ్ తీసుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికి ఓటు గుర్తింపు కార్డు నమోదుకు ఫారం 6 అప్లికేషన్ పూర్తి చేయాలన్నారు. ప్రతి ఒక్క బూత్ లెవెల్ అధికారి పారదర్శకంగా, వేగవంతంగా ఓటర్ల పరిశీలన ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

ఉత్తమ విద్య, వ్యక్తిత్వం విద్యావికాస్ లక్ష్యం

ప్రజాశక్తి - ఆకివీడు

విద్యార్థుల్లో ఉత్తమ లక్షణాలు అలవర్చడంతో పాటు ఉత్తమ జీవితాన్ని పొందగలిగేలా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని కళాశాల నిర్వహణ సలహాదారు ముత్యాల వెంకటస్వామి, డైరెక్టర్ కోముల సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక విద్యావికాస్ జూనియర్ కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలికే కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ చొప్పెర్ల బలరాం బాబు అధ్యక్షతన నిర్వహించిన సభలో వారు మాట్లాడారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు వి.కృష్ణంరాజు ముఖ్యఅతిథిగా, అతిథులుగా క్లబ్ కార్యదర్శి బుద్ధ చింతారావు, కోశాధికారి ఓలేటి వెంకట సుబ్రహ్మణ్యం, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సిద్ధానీ మాధవ మాట్లాడారు. అనంతరం కళాశాలలో గత సంవత్సరం మండల, కళాశాల ర్యాంకులు పొందిన విద్యార్థులు వారి తల్లిదండ్రులను యాజమాన్యం సత్కరించింది. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.